ఎమ్మెల్యే సత్యం కుటుంబానికి కేటీఆర్ పరామర్శ


ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పిల్లలను ఓదార్చుతున్న కేటీఆర్

మచ్చబొల్లారం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కుటుంబాన్ని అల్వాల్ సర్కిల్ పంచశీలకాలనీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం పరామర్శించారు. మ్మెల్యేకు ఆయన పిల్లలకు ధైర్యం చెప్పారు. ఇటీవల ఎమ్మెల్యే సతీమణి రూపాదేవి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. చిన్న వయసులో కుటుంబానికి తీరని లోటు జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. కేటీఆర్ వెంట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివేకానంద్, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నగరానికి విదేశీ మీడియా ప్రతినిధుల రాక

● పర్యాటక కేంద్రాల సందర్శన


గోల్కొండకోటలో విదేశీ మీడియా ప్రతినిధులతో మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్/మాదాపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన పలు ప్రఖ్యాత పర్యాటక కేంద్రాలను సందర్శించేందుకు హైదరాబాద్‌కు చేరుకున్న విదేశీ మీడియా ప్రతినిధులకు శంషాబాద్ విమానాశ్రయంలో సమాచార-పౌరసంబంధాల శాఖ, ప్రొటోకాల్ విభాగం అధికారులు ఘన స్వాగతం పలికారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన విదేశీ దౌత్య వ్యవహారాల విభాగం అధికారుల పర్యవేక్షణలో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన ప్రఖ్యాత పర్యాటక కేంద్రాలను విదేశీ మీడియా ప్రతినిధులు సందర్శించనున్నారు. నాలుగు రోజుల తెలంగాణ పర్యటనలో భాగంగా బుధవారం గోల్కొండ కోటను సందర్శించారు. ఆషాఢ బోనాల ఏర్పాట్లను పరిశీలించేందుకు గోల్కొండ కోట జగదాంబిక ఆలయానికి వెళ్లిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విదేశీ మీడియా ప్రతినిధులకు స్వాగతం పలికారు. గోల్కొండ కోట చరిత్ర, కులీకుతుబ్‌షాల పాలన, అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతియేటా ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాల వేడుకల ప్రాశస్త్యాన్ని వారికి వివరించారు. అనంతరం విదేశీ మీడియా ప్రతినిధుల బృందం శిల్పారామంను సందర్శించింది. అక్కడ తెలంగాణ హస్త కళాకారుల ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా రితిక, తనిష్కలు ప్రదర్శించిన కూచిపూడి ప్రదర్శన ఆకట్టుకుంది.

ఇంగ్లిష్ ఛానెల్‌ను ఈదిన తొలి తెలుగు మహిళ

● గంధం క్వీణి విక్టోరియా రికార్డు


గంధం క్వీణి విక్టోరియా(సర్కిల్‌లో)

బర్కత్‌పుర, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గంధం క్వీణి విక్టోరియా ప్రపంచమంతా స్విమ్ ఎవరెస్ట్‌గా పిలుచుకునే ఇంగ్లిష్ ఛానెల్‌ను 44 ఏళ్ల వయస్సులో ఈదిన తొలి తెలుగు మహిళగా రికార్డు నెలకొల్పారు. ఈ నెల 24న బ్రిటిష్ కాలమానం ప్రకారం రాత్రి 10 గంటల 46 నిమిషాలకు ఇంగ్లాండ్‌లోని డోవర్ కోస్ట్ నుంచి రిలే స్విమ్మింగ్ ప్రారంభించి 25న సాయంత్రం 4 గంటల 16 నిమిషాలకు ఫ్రాన్స్ దేశంలోని ఫ్రెంచి కోస్ట్‌కు చేరుకుంది. ఇంగ్లండ్, ఫ్రాన్స్ దేశాల మధ్య ఉన్న ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రాన్ని ఇంగ్లిష్ ఛానెల్‌గా పిలుస్తారు. ఈ రెండు దేశాల మధ్య దూరం 36 కిలోమీటర్లు. రాత్రి వేళల్లో అలల తాకిడి అధికంగా ఉండడం వల్ల 71 కిలోమీటర్ల మేర క్రాస్ స్విమ్మింగ్ చేసి 16 గంటల 50 నిమిషాలలో ఇంగ్లిష్ ఛానెల్‌ను ఒక వైపు ఈదానని గంధం క్వీణివిక్టోరియా తెలిపారు. 8 మంది బృందంతో కలిసి ఇంగ్లండ్‌కు వెళ్లానని చెప్పారు. బ్లూడాల్ఫింగ్ స్విమ్మింగ్ క్లబ్‌లో కోచ్‌లు దినేష్ రాజోరియా, రాధికమండవ వద్ద శిక్షణ పొందిన ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన విక్టోరియా బర్కత్‌పురలో ఉంటున్నారు. తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు సతీష్ మట్ట బుధవారం విక్టోరియాను అభినందించారు.

కేడర్ ప్రాసిక్యూటర్ల ప్రమోషన్లపై అసత్య ప్రచారం

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కేడర్ ప్రాసిక్యూటర్ల ప్రమోషన్లతో న్యాయవాదులకు అన్యాయం జరుగుతోందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తెలంగాణ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్(కేడర్) అసోసియేషన్ ఖండించింది. రాష్ట్రంలోని 220 సెషన్ కోర్టుల్లో న్యాయవాదుల నుంచి టెన్యూర్ పీపీలుగా ఎన్నుకోబడిన 108 మంది వివిధ కోర్టుల్లో పనిచేస్తుండగా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా ఉద్యోగం పొంది ప్రమోషన్‌ల ద్వారా సెషన్ కోర్టుల్లో పీపీలుగా పనిచేస్తున్న వారు 42 మంది ఉన్నారని, కొంతమంది పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేడర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.శైలజ. జనరల్ సెక్రటరీ కె.నరేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీ అయిన ఏపీపీ పోస్టుల్లో యువ న్యాయవాదులకు అవకాశాలు వస్తాయని వారు తెలిపారు.

9న అయోధ్య, కాశీ సహా ఐదు పుణ్యక్షేత్రాలకు రైలు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల నుంచి అయోధ్య, కాశీ సహా ఐదు పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు ఐఆర్‌సీటీసీ తొమ్మిది రోజుల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. జూలై 9న సికింద్రాబాద్ స్టేషన్ నుంచి భారత్‌గౌరవ్ టూరిస్ట్ అయోధ్య-కాశీ పుణ్యక్షేత్ర యాత్ర రైలు బయలుదేరుతుందని అధికారులు తెలిపారు. గయ, వారణాసి, సారనాథ్, అయోధ్య, ప్రయాగరాజ్‌లను సందర్శించే పర్యాటకుల కోసం ప్రత్యేక ప్యాకేజీ రూపొందించినట్లు వారు పేర్కొన్నారు. వివరాలకు 9281495843, 9281495845 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు తెలిపారు.

నిమ్స్‌లో పూర్తిస్థాయి చికిత్సలు : బీరప్ప

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రిలో దుప్పట్ల కొరత కారణంగా గ్రామాల నుంచి వచ్చిన వారిని చేర్చుకోవడం లేదంటూ సోషల్ మీడియాలో వస్తున్న కథనం అవాస్తమని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసర సేవల విభాగం, ఔట్‌పేషెంట్ల విభాగంలో రోగులను చేర్చుకుంటూ పూర్తిస్థాయిలో చికిత్సలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు అన్ని విభాగాల అడ్మిషన్ జాబితాను విడుదల చేశారు.

ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి

● ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్

● రెండు కార్లు, 280 కిలోల సరుకు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ముగ్గురు సభ్యులను ఎల్‌బీనగర్ ఎస్ఓటీ, చౌటుప్పల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్ర షోలాపూర్ బ్రహ్మపురి గ్రామానికి చెందిన బోంస్లే ఆబా మచ్చీంద్ర అలియాస్ అబా(29), షోలాపూర్ సౌత్‌కు చెందిన అవినాష్ శివాజీ రాథోడ్(19), షోలాపూర్ సౌత్ పాషానగర్‌కు చెందిన సిద్ధరామేశ్వర్ పూజారి అలియాస్ సిద్ధూ(27) స్నేహితులు. 10వ తరగతి వరకు చదువుకుని డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వీరికి షోలాపూర్‌కు చెందిన గంజాయి విక్రేత అజయ్ రాథోడ్‌తో పరిచయం ఏర్పడింది. అజయ్ డబ్బు, వాహనాలు సమకూర్చితే ఒడిశా అలూరి కోటకు చెందిన తేజ నుంచి గంజాయి కొనుగోలు చేసి షోలాపూర్‌కు తీసుకెళ్లి అధిక ధరకు విక్రయిస్తున్నారు. గంజాయి కొనుగోలు చేసేందుకు అజయ్ రాథోడ్ డబ్బులు, కార్లు సమకూర్చాడు. రెండు కార్లలో ఒడిశా వెళ్లిన ముగ్గురు నిందితులు 280 కిలోల గంజాయి తీసుకొని విజయవాడ, ఖమ్మం, హైదరాబాద్ మీదుగా షోలాపూర్ వెళ్తున్నారు. వీరి దందాపై సమాచారం అందుకున్న పోలీసులు పంతంగి టోల్‌గేట్ వద్ద కార్లను తనిఖీ చేశారు. రెండు కార్లు, 280 కిలోల గంజాయి, మూడు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి


కబ్జా అవుతున్న ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డును చూపిస్తున్న స్థానికులు

రాంనగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు మహమ్మదీయ మసీదు కమిటీ యత్నిస్తోందని స్థానికులు ఆరోపించారు. బస్తీవాసి రుద్ర నిగమగోచర్ బుధవారం మాట్లాడుతూ.. 1970లో 498 గజాల్లో ఉన్న పాత ఇంటిని కొనుగోలు చేశామన్నారు. 400 గజాల్లో ఇల్లు ఉండగా 98 గజాల ఖాళీ స్థలం ఉందన్నారు. 2010లో అప్పటి ముషీరాబాద్ తహసీల్దార్ సుజాత మా ఖాళీ స్థలంతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. తమ స్థలంలో బోర్డు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ కోర్టుకు వెళ్లామన్నారు. తమ ఇళ్లు శిథిలావస్థకు చేరడంతో జీహెచ్ఎంసీ అధికారులు ఖాళీ చేయాలని ఏడాది క్రితం నోటీసులు ఇచ్చారని, పది నెలల నుంచి మరో చోట అద్దెకు ఉంటున్నామన్నారు. ఇదే అదునుగా భావించిన మసీదు కమిటీ వారు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్నారని, మసీదు గోడ కూల్చి గేటు ఏర్పాటు చేయడంతోపాటు రాత్రి వేళల్లో చదును చేస్తున్నారని పేర్కొన్నాడు. ఈ విషయాన్ని ముషీరాబాద్ తహసీల్దార్, ఉప తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు.

మాదకద్రవ్యాల మత్తులో పడొద్దు

● యువతకు ఏసీపీ జగన్ సూచన



మాట్లాడుతున్న నార్త్ జోన్ ఏసీపీ జగన్

ముషీరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):మాదకద్రవ్యాల మత్తులో పడొద్దని యువతకు నార్త్‌జోన్ ఏసీపీ జగన్ సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఆర్‌డీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ డేను బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు వాడినా, సరఫరా చేసినా 100కు డయల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఎస్ఆర్‌డీ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్ వాడితే ఆరోగ్యం పాడవడంతోపాటు జ్ఞాపక శక్తి కూడా తగ్గుతుందన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను యువతకు తెలియజేశారు. కార్యక్రమంలో నల్లకుంట సీఐ జగదీశ్వర్‌రావు, సూసైడ్ ప్రివెన్షన్ యాక్షన్ కమిటీ కార్యదర్శి అశ్విన్, ఎస్ఆర్‌డీ సంస్థ ప్రతినిధులు రాజేష్, భూమిక, మాధవి తదితరులు పాల్గొన్నారు.

దళిత, గిరిజనులకు రాష్ట్రంలో రక్షణ కరువు

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : మాల మహానాడు



మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ్మయ్య

నల్లకుంట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళిత, గిరిజనులపై దాడులు పెరిగిపోయాయని, ఇటీవల రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూలు జిల్లాలోని పలుచోట్ల దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి నర్సింహ్మయ్య ఆరోపించారు. నాగర్ కర్నూలు జిల్లా, కొల్లాపూర్ మండలం, ముళ్లచింతపల్లి గ్రామంలో ఆదివాసి చెంచు మహిళను అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం, కేసరం గ్రామంలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి జామపండ్లు కోస్తున్నాడని బాలుడి కాళ్లు కట్టేసి తీవ్రంగా గాయపరిచిన అగ్ర వర్ణాలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వనపర్తి గ్రామంలో పేరుమల్ల వెంకటస్వామి పై దాడి, నారాయణపేట జిల్లా కోటకొండ గ్రామంలో దళితులపై దాడి చేయడంతో రాష్ట్రంలో దళిత, గిరిజనులకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులు చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే మాల మహానాడు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మాలమహానాడు నాయకులు రఘునాథ్, వెంకటేష్, శ్యామ్‌సుందర్, మాసయ్య, బాలకృష్ణయ్య, శివకుమార్ పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న విద్యుత్ శాఖ అధికారి బ్రహ్మం

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

ముషీరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సెంట్రల్ జోన్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ బ్రహ్మం అన్నారు. బుధవారం ముషీరాబాద్ శివాలయం వీధిలో సమస్యలు తెలుసుకునేందుకు స్థానికులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సెంట్రల్ జోన్ పరిధిలో 306 ఫీడర్లు ఉన్నాయని, వాటిని పరిశీలించేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ కమల్‌కుమార్, ఏఈ శాంతారాం, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ధర్నాలో ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, నాగలక్ష్మి తదితరులు

ధరలు తగ్గించాలని ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా

ముషీరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు పెరుగుతున్న కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, కె.నాగలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం ముషీరాబాద్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రభుత్వాలు ప్రజలపై భారం మోపుతున్నాయని ఆరోపించారు. ఆకాశాన్ని అంటుతున్న ధరలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పెరుగుతున్న ధరలను తగ్గించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా నగర నాయకులు వరలక్ష్మి, విమల, షబానా, రాణి తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

చిక్కడపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని గాంధీనగర్ ఏసీపీ మొగులయ్య సూచించారు. చిక్కడపల్లి, దోమలగూడ పోలీస్‌స్టేషన్‌ల పరిధుల్లోని అమ్మవారి ఆలయాల నిర్వాహకులతో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు సీతయ్య, శ్రీనివాస్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాహు మహారాజ్‌కు నివాళి

రాంనగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో బుధవారం బాగ్‌లింగంపల్లిలో సంఘం కార్యాలయంలో సాహు మహారాజ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాలకు అధికారమే సాహు మహారాజ్‌కు నివాళులర్పించినట్లవుతుందన్నారు. ఊర్మిళ, స్వప్న, ధానకర్ణచారి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణంపై హర్షం

చిక్కడపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ నుంచి దోమలగూడ వరకు హుస్సేన్‌సాగర్ నాలాపై బ్రిడ్జి నిర్మాణంపై మాజీ కార్పొరేటర్లు హర్షం వ్యక్తం చేశారు. టి. శైలజాగోపాల్, పలుస బాల్‌రాజ్‌గౌడ్, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా బుధవారం చిక్కడపల్లిలో విలేకరులతో మాట్లాడారు.బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించడంపై జీహెచ్ఎంసీకి కృతజ్ఞతలు తెలిపారు.


కృష్ణాగౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ మైనారిటీ నాయకులు

అంబర్‌పేటలో కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తాం

అంబర్‌పేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ అన్నారు. ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా బుధవారం పార్టీ మైనారిటీ నేతలు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు యాసిన్ షరీఫ్, నాయకులు మహ్మద్అలీ, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ అడ్మిషన్లకు 44,806 మంది దూరం

● సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు 24,922 మందే హాజరు

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లకు ఈ ఏడాది సుమారు 44,806 మంది అభ్యర్థులు దూరమయ్యారా అంటే.. అవుననే అంటున్నారు అధికారులు. ఈ ఏడాది పాలిసెట్‌కు మొత్తం 92,808మంది నమోదు చేసుకోగా, 82,809మంది పరీక్ష రాశారు. వీరిలో 69,728మంది ఉత్తీర్ణులు కాగా, మంగళవారంతో ముగిసిన ధ్రువపత్రాల పరిశీలనకు 24,922మందే హాజరు కావడం గమనార్హం. పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లు తీసుకొని ఇంజనీరింగ్ డిప్లమో కోర్సులు చదివితే త్వరితగతిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని టెన్త్ పాసైన విద్యార్థులు భావిస్తారు. కొన్నేళ్లుగా గ్రామీణ ప్రాంతాలకు నుంచే ఎక్కువమంది మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులే ఈ డిప్లమో కోర్సుల వైపు మొగ్గుచూపుతున్నారు. పాలిసెట్ పరీక్ష రాసినపుడు విద్యార్థుల్లో ఉండే ఉత్సాహం, కౌన్సెలింగ్ సమయంలో కనిపించడం లేదు. పాలిసెట్ రాయడం వలన కలిగే ప్రయోజనాలు, డిప్లొమో కోర్సులతో లభించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై సాంకేతిక విద్యాశాఖ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీంతో ప్రతియేటా సుమారు 90వేల నుంచి లక్షమంది వరకు విద్యార్థులు ఆసక్తితో దరఖాస్తులు సమర్పిస్తున్నారు. అయితే, పాలిసెట్ ఫలితాలు వెల్లడయ్యాక, ఉత్తీర్ణులైన విద్యార్థులను గుర్తించి కౌన్సెలింగ్‌కు రప్పించడం, అడ్మిషన్లు పొందేవరకు వారికి అవగాహన కల్పించడంపై అధికారులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సరైన సాంకేతిక సదుపాయాల్లేని కారణంగా పాలిసెట్ ఉత్తీర్ణులైన విద్యార్థుల్లో మూడింట రెండొంతుల మంది కౌన్సెలింగ్‌కు దూరంగా ఉంటున్నారు. కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు సైతం కాలేజీలు/కోర్సులకు ఆప్షన్లు ఇచ్చుకోవడం ఎలాగో తెలియక ఇబ్బంది పడుతున్నారు.

వీరికి సాయమందించేందుకు ఏర్పాటు చేసిన కొన్ని హెల్ప్‌లైన్ సెంటర్లు సిబ్బంది కొరతతో హెల్ప్‌లెస్ సెంటర్లుగా మారాయి. దీంతో ప్రతియేటా పాలిటెక్నిక్‌లలో ఉన్న 29వేల సీట్లలో సుమారు 4వేల నుంచి 5వేల డిప్లొమో సీట్లు ఖాళీగానే ఉండిపోతున్నాయి. పాలిసెట్‌కు రిజిస్ట్రేషన్ సమయంలో సాంకేతిక విద్యాశాఖ అధికారులు చూపిస్తున్న చొరవను, కౌన్సెలింగ్ పూర్తయ్యేదాకా కొనసాగిస్తే బాగుండేదని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం తొలివిడత కౌన్సెలింగ్ పూర్తయినందున, రెండోవిడత కౌన్సెలింగ్‌కైనా పాలిసెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఎక్కువమంది హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, హెల్ప్‌లైన్ సెంటర్లలో మరిన్ని సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.


ధర్నా చేస్తున్న విద్యార్థులు

అలైడ్ హెల్త్ సైన్స్ మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలి

రాంనగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అలైడ్ హెల్త్ సైన్స్ మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని, అక్రమాలకు పాల్పడుతున్న హెల్త్ యూనివర్సిటీ వీసీని తొలగించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్. మూర్తి డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ హిమాయత్‌నగర్‌లో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 9 కళాశాలల్లో 800 మంది విద్యార్థులు చదువుతున్నారని, ముఖ్యంగా గాంధీ, ఉస్మానియా, ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, సూర్యాపేట, నల్లగొండ కాలేజీ విద్యార్థులకు సరైన కోర్సు, సిలబస్ లేదన్నారు. దీంతో 97 శాతం మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో ఫెయిలయ్యారని అన్నారు. యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం వల్లనే విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్, శ్రీనివాస్, రఘు తదితరులు పాల్గొన్నారు.


సంజీవయ్య నగర్ బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ పావని

కమ్యూనిటీహాల్ నిర్మాణానికి అదనపు నిధుల మంజూరుకు కృషి

చిక్కడపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సంజీవయ్యనగర్ కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం అదనపు నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావని తెలిపారు. కాలనీలో బుధవారం జీహెచ్ఎంసీ డీఈఈ గీత, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్‌తో కలిసి పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. పనులు ఆగిపోయిన కమ్యూనిటీహాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల సురేందర్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

చర్లపల్లి నుంచి వేవ్‌రాక్ ఐటీ కారిడార్‌కు బస్సు సర్వీసు

రాంనగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఐటీ, ఇతర ఉద్యోగుల కోసం బుధవారం చర్లపల్లి బస్టాండ్ నుంచి వేవ్‌రాక్ ఐటీ కారిడార్ వరకు 6డబ్ల్యూ బై 252 రూట్‌లో బస్సు సర్వీసు ప్రారంభించినట్లు ఆర్టీసీ ముషీరాబాద్ డిపో మేనేజర్ కిషన్‌రావు తెలిపారు. బస్సు చర్లపల్లి నుంచి ప్రారంభమై మల్లాపూర్, తార్నాక, రాంనగర్, సచివాలయం, మెహిదీపట్నం, టోలీచౌక్, గచ్చిబౌలి, విప్రో సర్కిల్ మీదుగా వేవ్‌రాక్ ఐటీ కారిడార్‌కు వెళ్తుందన్నారు. చర్లపల్లి నుంచి మొదటి బస్సు ఉదయం 5.20 గంటలకు, వేవ్‌రాక్ నుంచి 7.20 గంటలకు బయలుదేరుతుందన్నారు. ప్రతి 22 నిముషాలకు బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.

'జెమినీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి'

ముషీరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జెమినీ కాలనీలో డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ డిమాండ్ చేశారు. జలమండలి, జీహెచ్ఎంసీ, విద్యుత్ తదితర శాఖల అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. స్థానికులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో విద్యార్థులు, అధ్యాపకులు

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

రాంనగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని అంబేడ్కర్ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ రిషికాంత్ అన్నారు. బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాగ్‌లింగంపల్లిలో అంబేడ్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో బుధవారం చదువుకునే వయసులో పనిచేయవద్దు, బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పాలి అంటూ లా కాలేజీ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన మాట్లాడుతూ.. బాల కార్మికులను పనిలో పెట్టుకునే వారిపై కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ర్యాలీ బాగ్‌లింగంపల్లి కళాశాల నుంచి ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, హౌసింగ్ బోర్డు క్వార్టర్స్ మీదుగా సుందరయ్యపార్కు వరకు సాగింది. విద్యా సంస్థల అడ్మిన్ అధికారి కిరణ్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

25 ద్విచక్రవాహనాలు స్వాధీనం

బర్కత్‌పుర, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నంబర్ ప్లేట్లు సరిగా లేని, త్రిబుల్ రైడింగ్ చేస్తున్న, సరైన పత్రాలు లేని 25 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ కె. సుభాష్ తెలిపారు. నింబోలిఅడ్డ ఓల్డ్ ట్రాఫిక్ పీఎస్ వద్ద వాహనాల చెకింగ్ నిర్వహించామని, నంబర్ ప్లేట్లు సరిగ్గా లేని పది, త్రిబుల్ రైడింగ్ చేస్తున్న 15 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వారందరికీ కౌన్సెలింగ్ ఇచ్చామని, మరోసారి పట్టుబడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సన్మానం



సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆల్ హజ్ సయ్యద్ మదర్ సాబ్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సయ్యద్ ఇమామ్‌కు ఇంటర్నేషనల్ ఇన్సానియత్‌కి కిద్మత్ సొసైటీ జాతీయ అవార్డు ప్రకటించింది. రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్న ఆయనను గ్రేటర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ సంస్థ ప్రతినిధులు బుధవారం సన్మానించారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి